'కోట' కిటకిట



గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం 7 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు గోల్కొండ కోటకు చేరుకున్నారు. పెద్ద ఎత్తున వచ్చిన పర్యాటకులతో రాందేవ్‌గూడ, గోల్కొండ కోట చౌరస్తా, బాలాహిసార్ చౌరస్తా తదితర ప్రాంతాలు పర్యాటకులతో నిండిపోయాయి. కోటలోని ఆయుధాగారం, అక్కన్న మాదన్న కార్యాలయం, రామదాసు బందీఖానా తదితర చారిత్రక ప్రదేశాలను పర్యాటకులు ఎంతో ఆసక్తితో తిలకించారు. విశాలమైన కోట గోడల వద్ద యువజంటలు సెల్ఫీలు దిగారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి



నివాళులర్పిస్తున్న మనిలాల్ షా తదితరులు

అబిడ్స్: కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనిలాల్‌షా మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా పనిచేసిన వెంకటస్వామి పేద బడుగు వర్గాల కోసం చేసిన కృషి అమోఘమని కొనియాడారు. పేదరిక నిర్మూలనకు ఆయన నిరంతరం పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.కుమార్ రావు, మనిలాల్‌షా, భవేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన వైద్యులు



మణికొండలో విధుల్లో చేరిన డాక్టర్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

మణికొండ: ప్రభుత్వం ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్న బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు లేక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'అందని వైద్య సేవలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ప్రభుత్వం స్పందించింది. గండిపేట మండల పరిధిలోని నార్సింగి, మణికొండ, బండ్లగూడల్లో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని కథనంలో వివరించింది. స్పందించిన ప్రభుత్వం ముందుగా నార్సింగి, మణికొండలకు ఇద్దరు వైద్యులను కేటాయించిందని, బండ్లగూడకు వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉందని మండల వైద్యాధికారి సత్య రత్న తెలిపారు. మణికొండకు కేటాయించిన డాక్టర్ ఆఫ్రిన్‌కు వైద్య సిబ్బందితోపాటు స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు బి.ఇందిరరాంరెడ్డి మాట్లాడుతూ... పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అన్ని బస్తీ దవాఖానల్లో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్‌లను నియమిస్తుందన్నారు. వారి ద్వార పేదలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. డాక్టర్‌ల నియామకం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన 'సాక్షి'కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభావతి, నరేందర్, అశ్విన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలకు చెందిన ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను నియమిస్తూ ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర నాయకులు పోతురాజు యాదన్న, నాన్నగారి రామచందర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, శ్రీరామనగర్ కాలనీలను కలుపుతూ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కథలు వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా బోటుకుల కరణ్, సంయుక్త కార్యదర్శిగా గజాభాగా నరేశ్, ఉపాధ్యక్షులుగా కిన్నింటి రాజు తదితరులు నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు మందకృష్ణ మాదిగ ఆదేశం మేరకు కొత్త కమిటీలను నియమించామన్నారు. కమిటీ సభ్యులంతా అందరిని సమన్వయం చేసుకుంటూ బలోపేతం చేయాలని సూచించారు. నేతలు ఆవునూరి బాబురావు, చెరుకూరి మన్యం, లింగని కృష్ణ పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం..అస్తవ్యస్తం



మీరాలంమండిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

- మీరాలంమండిలో పడకేసిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

చార్మినార్: పాతబస్తీ ప్రజలకు నిత్యం కూరగాయలు సరఫరా చేసే మీరాలంమండిలో పారిశుద్ధ్య సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎప్పటికప్పుడు ఎత్తని చెత్తకుప్పలతో అటు రైతులు, వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మీరాలం మండిలోని కూరగాయల మార్కెట్‌లో ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించాలని కోరుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఇక్కడి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఉదయం మాత్రమే చెత్తకుప్పలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది తిరిగి మళ్లీ అటు వైపు చూడకపోవడంతో రోజంతా రోడ్లపై చెత్తకుప్పలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో అనారోగ్యాలకు గురయ్యే పరిస్థితులు న్నందున ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షానికే మీరాలంమండిలోని రోడ్లన్నీ మురికిగా తయారవుతున్నామంటున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో చెత్తకుప్పలను తొలగించే విధంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో పూజలు చేయడానికి వెళ్లే భక్తులు సైతం పలు ఇబ్బందులకు గురవుతున్నారు. జోనల్ కమిషనర్‌తో పాటు ఏఎంహెచ్‌ఓలు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలి. – కాట రమేష్, వ్యాపారి, మీరాలంమండి

పేద రోగులకు సేవలందించడం అభినందనీయం



బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: పేద రోగులకు మానవత్వంతో సేవలందించడం అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆవరణలో నెలకొల్పిన బ్లడ్ బ్యాంక్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా రెడ్‌క్రాస్ అన్ని రాష్ట్రాల ద్వారా పేద రోగులకు సేవలు అందిస్తుందని తెలిపారు. దేశంలో రోగుల సౌలభ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భారత్, వికసిత్ భారత్ వంటి పథకాల ద్వారా సేవలందిస్తుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ల ద్వారా బ్లడ్ బ్యాంక్‌లను విస్తరించేందుకు ఉమ్మడి ఒప్పందం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సంస్థలు చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్‌బన్సాలి జ్ఞాపకార్థం రూ.10 లక్షల చెక్కును బ్లడ్ బ్యాంక్ కోసం గవర్నర్ చేతుల మీదుగా తెలంగాణ ఐఎంఏ ప్రతినిధులకు అందజేశారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ..నగరంలో పుట్టగొడుగుల్లా నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నాయని వాటిపై రోజుకు 20 ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అశోక్, కోశాధికారి డాక్టర్ దయాల్ సింగ్, ఎలక్ట్రిక్ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కిషన్, డాక్టర్ కాశీ ప్రసాదరావు, డాక్టర్ కృష్ణారెడ్డి, పీఆర్.సాయికుమార్, డాక్టర్ గట్టు శ్రీనివాసులు, డాక్టర్ తపాడియా, డాక్టర్ సాయిరాం పాల్గొన్నారు.

అలీజాపూర్‌లో శ్మశానవాటికకు స్థలం కేటాయింపు



అలీజాపూర్‌లో ప్రభుత్వ స్థలంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేనీ

గోల్కొండ: కుతుబ్‌షాహీ ఈద్గా అలీజాపూర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటు కేటాయించారని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేనీతో కలిసి అలీజాపూర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జూబ్లీహిల్స్ నియోకవర్గంలో ఖాళీగా ఉన్న స్థలాలను శ్మశానవాటికలకు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు స్థలం కేటాయింపుపై ఆదేశాలు ఇచ్చారన్నారు. అలీజాపూర్‌లో ఎకరం ఐదు గుంటలు స్థలం ఖాళీగా ఉందని అన్ని అనుమతులు పొందిన తర్వాత ముస్లిం శ్మశానవాటికగా తీర్చిదిద్దుతామన్నారు. కార్పొరేటర్లు మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్, మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అరూన్ ఫరాన్, ఆలీముద్దీన్, షకీల్ ఆలీఖాన్, పాషాభాయ్, ముస్తాఫా తదితరులున్నారు.

'ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తాం'



మిలటరీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫరాజ్ తదితరులు

గోల్కొండ: అలీజాపూర్‌లో తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని ఎవరికీ అప్పగించమని గోల్కొండ ఆర్టిలరీ అధికారులు స్పష్టం చేశారు. ఆదివారం అలీజాపూర్‌లోని 1.05 ఎకరాల స్థలం ప్రభుత్వానిదని తేలడంతో మజ్లిస్ నాయకులు ఆ స్థలానికి చేరుకున్నారు. అంతకు ముందే ఆ స్థలాన్ని బల్దియా వారు చదును చేసి ఉంచారు. అయితే అక్కడ విధి నిర్వహణలో ఉన్న మిలటరీ జవాన్లు, హవల్‌దార్‌లు ఈ స్థలం తమదే అంటూ స్పష్టం చేశారు. పై అధికారుల నుంచి ఈ స్థలంపై తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని అక్కడ ఉన్న వారు కార్పొరేటర్ ఫరాజ్‌కు స్పష్టం చేశారు.

గాంధీ స్ఫూర్తి అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలతో మధుసూదనాచారి, రొయ్యూరు శేష సాయి, అద్దంకి రాజా

నాంపల్లి: మహాత్మాగాంధీ చూపిన మార్గమే అందరికీ శరణ్యమని తెలంగాణ అసెంబ్లీ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. నాంపల్లి తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి అధ్యక్షతన ఆదివారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ..ఎటువంటి ఆయుధాలను ఉపయోగించకుండా గాంధీ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని గుర్తుచేశారు. విశ్వహిందూ రక్ష పరిషత్ జాతీయ మహిళా అధ్యక్షురాలు నడింపల్లి యమునా పఠక్ మాట్లాడుతూ..గాంధీజీ పద్ధతులు భారతీయులకే కాక ఇతర దేశాల నాయకులకు స్ఫూర్తినిచ్చాయన్నారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విభిన్న రంగాల్లో విశిష్టమైన సేవలందించిన 16 మందికి గాంధీ స్ఫూర్తి అవార్డులతో ఘనంగా సత్కరించారు. గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డాన్స్ వారి భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కవిసార్వభౌమ శ్రీనాథుని వారసులు డాక్టర్ కావూరి శ్రీనివాస్ శర్మ, ప్రముఖ సాహితీవేత్త వరలక్ష్మి, బీజేపీ నగర నాయకులు ప్రతాప వంశీకృష్ణ, వి.మురళీధర్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

తవ్వారు..వదిలేశారు



ప్రమాదకరంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు

గౌలిపురా: ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారులు పైప్‌లైన్ పనుల కోసం తవ్వి పనులు పూర్తయిన తర్వాత గుంతను పూరిస్థాయిలో పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఇద్దరు వాహనదారులకు గుంతలో పడి తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, వ్యాపారస్తులు, వాహనదారులు వాపోతున్నారు.

40 సబ్ కమిటీలతో నుమాయిష్‌కు ఏర్పాట్లు



సుఖేష్‌రెడ్డి

అబిడ్స్: దాదాపు 40 సబ్ కమిటీలతో నుమాయిష్ (ఎగ్జిబిషన్–2026)ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆర్.సుఖేష్‌రెడ్డి వెల్లడించారు. సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..నుమాయిష్ నిర్వహణకు కసరత్తు ప్రారంభమైందని, స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి కోసం దరఖాస్తు ఫారాలను అందజేస్తున్నామన్నారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే నుమాయిష్‌ను విజయవంతం చేసేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుల సహకారంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. నుమాయిష్‌కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎగ్జిబిషన్ నిర్వహణకు పోలీస్, అర్అండ్‌బీ, ఫైర్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ఇతర పలు శాఖల సమన్వయం, ఆయా శాఖల అధికారుల సహకారంతో ఎగ్జిబిషన్‌ను ప్రతి సంవత్సరం మాదిరిగానే రాబోయే కొత్త సంవత్సరంలో విజయవంతంగా చేపడుతామన్నారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

డబీర్‌పురా: పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిని ఆదివారం మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..దసరా ఉత్సవాల్లో భాగంగా వరుణ్ ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి ఊరేగింపును ఆదివారం తెల్లవారుజామున నిర్వహిస్తున్నారు. కాగా సిబ్బందితో కలిసి బందోబస్తులో ఉన్న మీర్‌చౌక్ ఎస్సై రాజశేఖర్ ఊరేగింపును త్వరగా ముందుకు తీసుకెళ్లాలని సూచించాడు. కాగా మద్యం మత్తులో ఉన్న కిశోర్ అనే వ్యక్తి ఎస్సై రాజశేఖర్‌తో దురుసుగా ప్రవర్తిస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై ఎస్సై రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని కిశోర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పేరుకుపోయిన చెత్త కుప్పలు



మోతీమహల్ చౌరస్తా వద్ద..

గోల్కొండ: కార్వాన్ నియోజవర్గంలోని గుడిమల్కాపూర్, కార్వాన్ ప్రధాన రహదారులపై పేరుకుపోయిన చెత్త కుప్పలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. అదే విధంగా మోతీమహల్ చౌరస్తా, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో సైతం పారిశుద్ధ్య పనులు అటకెక్కడంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.

'అమృతమంజరి జ్ఞానమంజరి అంకురం-2' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి తదితరులు

ఖైరతాబాద్: మనోజ్యోతి ఆశ్రమ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో 'అమృత మంజరి జ్ఞానమంజరి అంకురం-2' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 'ఒకే దేవుడు–ఒకే దేశం' సిద్ధాంతాన్ని భారతదేశమంతటా చాటిచెబుతూ మనుజ్యోతి ఆశ్రమ స్థాపకుడు శ్రీమన్నారాయణ శ్రీ లహరీ కృష్ణ అమృతమంజరి రూపొందించి పుస్తకాన్ని మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, వకులాభరణం కృష్ణమోహన్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రాం తివారీ, డాక్టర్ చంద్రకాంత్ రావు, మోహన్ కుమార్ గాంధీ, దైవాజ్ఞశర్మ, నటి కారుణ్య తదితరులు ఆవిష్కరించారు. అలాగే ఆధ్యాత్మిక ప్రసంగీకులు 'ఒకే దేవుడు–ఒకే దేశం' అనే అంశంపై ప్రసంగించారు.

పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలి



నాంపల్లి: హైదరాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడున్న పోలీసు ఔట్ పోస్టును కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా తొలగించాలని వివరించారు. ఔట్ పోస్టును కూల్చివేసి 12 ఏళ్లు పూర్తవుతున్నా నేటికీ అక్కడ పోలీసు ఔట్ పోస్టు నిర్మాణం జరగలేదు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లను అత్యంత అధునాతన సౌకర్యాలతో పోలీస్ స్టేషన్లను నిర్మించారని, కానీ ఇక్కడున్న ఔట్ పోస్టును నిర్మించకుండా వదిలేశారు. హైదరాబాద్ రైల్వే స్టేషన్ ముఖ ద్వారంలో ఉండాల్సిన పోలీసు ఔట్ పోస్టు పనిచేయకపోవడంతో ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. జులాయిలు గంజాయిని సేవిస్తూ న్యూసెన్స్ చేస్తున్నారు. మెట్రోస్టేషన్, బల్దియా సరాయి. తెలుగు వర్సిటీ బస్టాపులు, యూసుఫియన్ దర్గా చౌరస్తా వంటి ప్రాంతాల్లో వీరి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కావున నూతనంగా నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్ హైదరాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'విశ్వలింగ శతకం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాహిత్య అకాడమి, చంద్రిక గ్రంథ మండలిల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత సాతుపాటి గంగయ్య రచించిన 'విశ్వలింగ శతకం'పుస్తకావిష్కరణ సభ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి ఎస్.బాలచారి మాట్లాడుతూ..ఆధ్యాత్మిక విషయాలను పద్య రూపకంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, చంద్రిక గ్రంథ మండలి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయభాస్కర్, ఇన్‌స్పెక్టర్ కె శ్రీనివాసులు, డాక్టర్ వేముల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాండియా విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శోభాపాండే

గోల్కొండ: గోల్కొండ కోటలో తాము నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని హిందూ సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి శోభాపాండే అన్నారు. సమితి వారు నిర్వహించిన దాండియా సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విజేతలకు ఆదివారం ఆమె బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందూ ముస్లింల పటిష్టమైన స్నేహానికి గోల్కొండ కోటలో జరిగే దసరా వేడుకలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వివిధ క్రీడా పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె మధులిక, బొమ్మల దేవికకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాంతిదేవి, సాయి బాబా చారి తదితరులున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం



మహేష్‌కుమార్‌గౌడ్‌తో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ఎంతో బలిష్టంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును రాష్ట్ర ప్రజలు ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేస్తున్నారన్నారు. అయితే కాంగ్రెస్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి రాష్ట్రంలోని ప్రతి పక్షాలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో వెంకట్‌రెడ్డి, జయరాంరెడ్డి తదితరులున్నారు.

తెలంగాణ జాగృతి చార్మినార్ ఇన్‌చార్జిగా రాధాకృష్ణ



కవితకు ధన్యవాదాలు తెలియజేస్తున్న రాధా కృష్ణ

చార్మినార్: తెలంగాణ జాగృతి చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా తనను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారని పుప్పాల రాధాకృష్ణ తెలిపారు. తాను గతంలో బీఆర్‌ఎస్ మొగల్‌పురా డివిజన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించానన్నారు. నాపై నమ్మకం ఉంచి చార్మినార్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు అధ్యక్షురాలికి ధన్యవాదాలు తెలియజేశామన్నారు.

కృష్ణవేణికి ఘన నివాళి



కృష్ణవేణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు, తదితరులు

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ ముఖ్య సలహాదారులు కె.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ భార్య కృష్ణవేణి సంతాప సభను ఆదివారం సుల్తాన్ షాహీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, కమిటీ మాజీ అధ్యక్షుడు మల్లేషంగౌడ్, కమిటీ ప్రతినిధులు అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, బి.వై.శ్రీకాంత్, మోహన్, కాపర్తి శ్రీకాంత్, ముచ్చటి ప్రకాశ్, బొడ్డు సాయిబాబా, వినోద్, విక్రమ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రముఖ్ చంద్రశేఖర్

అబిడ్స్: దేశంలో కుటుంబ విలువలు నశించిపోతున్నాయని ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రముఖ్ చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం జాంసింగ్ ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు జరిగాయి. సమాజంలో ఉన్న వారంతా హిందువులేనని, అందరూ కలిసిమెలిసి జీవించాలని చంద్రశేఖర్ అన్నారు. దేశంలో అన్ని చోట్ల ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించి ఉందని, అట్టడుగు వర్గాల కోసం పనిచేస్తుందని వివరించారు. స్వదేశీ వస్తువులు వాడాలని అనాథలను అక్కున చేర్చుకోవాలని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఆర్‌ఎస్‌ఎస్ శిక్షకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

గోల్కొండ భాగ్–మహాదేవపట్నం నగర్ ఆధ్వర్యంలో..

నాంపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘాన్ని స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ గోల్కొండ భాగ్–మహాదేవపట్నం నగర్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతినగర్ ఐటీఐ పెద్దమ్మ తల్లి ఆలయంలో శతాబ్ది ఉత్సవాన్ని నిర్వహించారు. సంఘచాలక్ విభాగ్ పి.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయవాది అల్లూరి త్రిగుణాత్మ హాజరయ్యారు. ప్రధాన వక్తగా ప్రాంత పర్యావరణ టోలీ పాండురంగ విట్టల్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రాశస్త్యాన్ని వివరించారు. 1925లో డాక్టర్ కేశవరావ్ బలీరామ్ హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించినట్లు చెప్పారు. నగర సహ కార్యవాహ్ చంద్రకిషోర్, బీజేపీ అహ్మద్‌నగర్ డివిజన్ అధ్యక్షులు శాస్త్రి, కాలనీ డివిజన్ అధ్యక్షులు ఆనంద్ రావు, బీజేపీ నేతలు ముఖేష్ పాల్గొన్నారు.



ఉత్సవానికి హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ నేతలు